# రంగుల వల

ఆయన ఆఫీసు పనిమీద వూరికి వెళ్లారు. పిల్లలు స్కూలుకి వెళ్లారు. సెలవులు చాలా ఉండిపోయాయని, సంవత్సరం ఆఖరుకి వచ్చేస్తోందనీ నాలుగు రోజులు వరుసగా సెలవు పెట్టేశాను. రెండ్రోజులు ఇల్లు సర్దుకోవడం, చీరలు గంజి పెట్టడం, ఇస్త్రీ చేసుకోవడం వీటితో అయిపోయింది. ఒకరోజు పూర్తిగా రెస్టు తీసుకున్నాను. ఇక ఈ రోజు పని ఏమీ కనిపించలేదు. మధ్యాహ్నం ఏమీ తోచలేదు. అప్పుడప్పుడు ఫోన్లో మాట్లాడటమే తప్ప వనజని చూసి చాలా కాలమైంది అని గుర్తు వచ్చింది.

'అకస్మాత్తుగా వెళ్లి సర్ప్రయిజ్ చేస్తాను. ఫోన్లో మాట్లాడినా ఎక్కువసేపు కుదరదు కదా. చక్కగా ఎదురెదురుగా కూర్చొని కబుర్లు కలబోసుకోవటంలో ఉండే తృప్తి ఫోన్లో ఏముంటుంది' అనుకున్నాను.

స్కూలు నుండి వచ్చాక తినటానికి పిల్లలకు చిరుతిళ్లు గిన్నెల్లో సర్దిపెట్టి, పాలు మరగబెట్టి ఫ్లాస్కులో వేసి ఉంచాను. అయిదింటిలోపే వచ్చేస్తాను. చదువుకోమని చీటీ రాసిపెట్టి బయల్దేరాను.

వనజ యింటికి వెళ్లి తలుపు తట్టాను.

విసుక్కుంటూ తలుపు తీసిన వనజ ఆశ్చర్యపోయింది.

"ఇదేమిటి ఇలా దారితప్పి వచ్చేసావు?" అంది.

"దారి వెతుక్కుంటూనే వచ్చాను కానీ ఏమిటీ ఈ అవతారం" అన్నాను ఆమెని పరిశీలిస్తూ.

ఇల్లు బూజులు దులుపుతోంది కాబోలు మాసిన చీర కొంగు బిగించి, కుచ్చెళ్లు పైకి లాక్కుని ఉంది. ముఖం అంతా చెమట్లు దిగజారి చెదరిన వెంట్రుకలు నుదురంతా అతుక్కున్నాయి.

"నువ్వైతే ఉద్యోగస్తురాలివి, గంజి పెట్టిన ఇస్త్రీ చీర కట్టి బొమ్మలా ఉంటావు. నాకెట్లా కుదురుతుంది" అంది నన్ను పైనుండి కింద వరకూ ఎగాదిగా చూస్తూ.

"మరే, నాకు ఇంట్లో వంటాగింటా ఉండవు. అడ్వర్టయిజుమెంట్లో అమ్మాయిలా ఫలానా గంజిపొడి పెట్టిన చీర కట్టుకుని తిరగటమే పని. ఆ కబుర్లకేంగానీ ఇంకా స్నానం, భోజనం కాలేదా" అన్నాను సోఫాలో చతికిలబడుతూ.

"పండగలు వస్తున్నాయి కదా అని ఇల్లు శుభ్రం చేసే పని పెట్టుకున్నాను. అయిపోయిందిలే. క్షణంలో స్నానం చేసి వస్తాను. కలిసి భోంచేద్దాం" అంది వనజ కూడా నవ్వుతూ.

"నేను భోంచేసే వచ్చాలే. నువ్వు తొందరగా స్నానం చేసి రా. నేను పుస్తకం తిరగేస్తూ కూర్చుంటాను."

వనజ అప్పటికే గదులు ఊడ్చడం పూర్తిచేసి, రెండు పత్రికలు నా ముందు పడేసి టీవీ ఆన్‌చేసి స్నానానికి వెళ్లింది.

ఆ పత్రికలు అంతకుముందు చదివేసినవే. టీవీ కాసేపు చూసి విసుగుపుట్టి గదంతా పరిశీలిస్తూ కూర్చున్నాను.

అంతలోనే వనజ స్నానం పూర్తిచేసి తయారై వచ్చింది. నా ముందు కూర్చోబోతే, "ముందు నువ్వు భోంచెయ్. ఇప్పటికే లేటయింది" అన్నాను.

నాకు ప్లేటులో కారప్పూసా, స్వీటు, ఆపిల్ ముక్కలు పెట్టి తాను భోజనానికి కూర్చుంది వనజ.

ఓ కన్ను టీవీ మీద పెట్టి భోంచేస్తూ ఉంది.

నాకు మాట్లాడటమో, టీవీ చూడటమో అర్థంకాక ఒక్కొక్కటే కారప్పూసా నోట్లో వేసుకుంటూ వనజని చూస్తూ కూర్చున్నాను.


టీవీలో ఏదో డిటర్జెంటు పొడరు ప్రకటన వస్తోంది. బట్టలు మురికి చేసుకుని వచ్చిన భర్తనీ, కొడుకునీ చూసి విసుక్కోకుండా "ఇవి ఉతకటం, ఆరేయటం రోజూ చేసే పనే" అని తేలికగా అంటూంది నవ్వుతూ బొమ్మలా మడత నలగని చీరతో ఉన్న ఆ మోడల్ అమ్మాయి.

"నేనూ ఆ పౌడరే వాడతాను. ఏమో ఎంత ఉతికినా తెల్లగా రావు" అంది వనజ అటే చూస్తూ.

ఏమీ మాట్లాడకుండానే ఆమెనే చూస్తూ నేను నవ్వి వూరుకున్నాను.

"స్వీటు ఫలానా నెయ్యితోనే చేసాను. ఎలా ఉందో చెప్పవోయ్" అంది నేను స్వీటు తినకపోవటం చూసి.

సరే అని చిన్న ముక్క తుంచి నోట్లో వేసుకున్నాను. ఏదో అనాలి కదా అన్నట్లు 'చాలా బాగుంది' అన్నాను. వనజ ముఖంలో సంతోషం కనిపించింది.



-శీలా సుభద్రాదేవి

వనజ భోజనం పూర్తిచేసి గిన్నెలు సర్దుతూ "ఇన్‌స్టెంట్ కాఫీ కలపనా? ఆ బ్రాండు కాఫీ చాలా బాగుంటుంది. తాగితే వదలవు" ఊరిస్తున్నట్లుగా అంది.

"ఇప్పుడే ఎందుకులే. కాసేపు అయ్యాక నువ్వు కూడా తాగే టైము అయితే అప్పుడు కలిసి తాగుదాం" అన్నాను. నేను కూడా డైనింగ్ టేబుల్ ముందు నుండి లేస్తూ.

"సరే అయితే. ఆ అన్నట్లు ఈ ఫ్రిజ్ కొత్తగా కొన్నాను చూసావా? దీంట్లో ఐస్‌క్యూబ్స్ క్షణాల్లో తయారు చేసుకోవచ్చు. దీంతోబాటు ఇస్త్రీపెట్టె అదే కంపెనీది ఫ్రీ తెలుసా" కళ్లు గుండ్రంగా తిప్పుతూ చెప్పింది, ఫ్రిజ్ తెరిచి మరీ చూపుతూ.

"ఆ మధ్య ఎప్పుడో కొనబోతున్నట్లు ఫోనులో చెప్పినట్లున్నావు" అన్నాను నేను కూడా.

తాను కొన్న వస్తువుల గురించి చెబుతూనే డైనింగ్ టేబుల్ శుభ్రం చేసి ఎలా అయితేనేం మొత్తంమీద వచ్చి

డ్రాయింగ్‌రూమ్‌లో నా ప్రక్కన కూర్చుంది వనజ.

"చాలా కాలమైంది కదూ. మనం ఇలా దగ్గరగా కూర్చుని కబుర్లు చెప్పుకుని ఎంతకాలమైందో. కాలేజీలో చదువుకునే రోజుల్లో తరచూ కలుసుకుని కబుర్లు చెప్పుకునే వాళ్లం. ఇప్పుడు ఒకే ఊళ్లో ఉన్నా కాసేపు ఫోన్లోనే మాట్లాడుకోవటం అవుతోంది" ఆర్తిగా అన్నాను. ప్రక్కనే కూర్చున్న వనజ చేతులు నా చేతుల్లోకి తీసుకుంటూ.

"నీకు ఉద్యోగం, నాకు ఇంట్లో పనితోనే సరిపోతోంది. ఆదివారాలు, సెలవు రోజుల్లో ఇంట్లో పిల్లలూ, మగవాళ్లూ ఉండటం, ఎవరో ఒకరు రావటంతో కలుసుకోవటమే అరుదైపోయింది" అంటూ వనజ కూడా తన చేతిలోవున్న నా చేతిమీద మెత్తగా రాస్తూ అకస్మాత్తుగా నా చేయి పరిశీలించి "ఏమిటీ నీ చేయి ఇంత గరుకుగా ఉంది, ఏదీ నీ పాదాలు చూడనీ" అని నా చీర కుచ్చిళ్లు పాదాలమీంచి పైకిలాగి పాదాల్ని కూడా పరిశీలించింది.

గభాలున లేచి అల్మారాలోంచి ఒక క్రీము తీసుకొచ్చి "ఇదిగో ఈ క్రీము నువ్వు కూడా కొనుక్కుని రాస్తూండు. మృదువుగా అయిపోతాయి. ముఖాన్నే కాదు పాదాల్నీ, చేతుల్నీ కూడా సంరక్షించుకోవాలి" అంది ప్రకటనలా.

నేను ఫకాలున నవ్వాను.

"నా మాట మీద నమ్మకం లేదు కదూ. ఇదుగో ఇప్పుడు ఈ నాటకం మధ్యలో వచ్చే ప్రకటన చూడు నువ్వే నమ్ముతావు" బుంగమూతి పెట్టుకుని నా చెయ్యి విసిరికొట్టి సోఫాలో దూరంగా జరిగి కూర్చుంది వనజ.

వనజ అన్నట్లుగానే అంతలోనే ఆ ప్రకటన టీవీలో వస్తోంది. కాస్సేపటికే వనజ మామూలుగానే తన్మయంగా టీవీ చూస్తోంది.

"అన్నట్లు నీకు తాగటానికి ఏమీ ఇవ్వలేదు కదూ. ఏం చెయ్యమంటావు రంగూ, రుచి, వాసనా మూడు గుణాలున్న టీ ఇవ్వనా! ఉదయాన్నే శుభ ప్రారంభాన్ని యిచ్చే కాఫీ కలపనా. నీదే ఛాయిస్" అంది లేచి నిలబడి.

"నాకేమీ వద్దు, చల్లని నీళ్లు చాలుకానీ, ఇలా వచ్చి కూర్చొని కబుర్లు చెప్పు" అన్నాను విసుగ్గా ముఖం చిట్లించి.

"ముఖం ఏమిటి అలా ఉంది. తలనొప్పిగా ఉందా? చిటికలో తగ్గించే టాబ్లెట్ ఇవ్వనా. మళ్లీ నాటకం మొదలు కాకముందే కాఫీ చేసి రెండు నిమిషాలలో తెస్తాను" అంది హడావుడిగా.

నేనేమీ మాట్లాడలేదు. మౌనం అర్ధాంగీకారం అనుకుందేమో. వంటింట్లోకి వెళ్లి అన్నట్లుగానే రెండు నిమిషాల్లో నూడుల్స్ బౌలు, రెండు టీలు తీసుకుని వచ్చింది.

అంతలో టీవీలో మొదలైన నాటకానికి కళ్లు అతికించి కూర్చుంది. నేను మాట్లాడకుండానే అవి పూర్తిచేసి "ఇంక పిల్లలు స్కూలు నుండి వచ్చే వేళయింది. వెళ్తాను" అంటూ లేచాను.

ఇబ్బందిగానే నా వెనకే లేచి గుమ్మం వరకూ సాగనంపింది. నేను గుమ్మం దాటి నాలుగడుగులు వేయగానే వెనకే తలుపులు మూసుకున్నాయి.

నాకు తెలుసు ఈపాటికి వనజ రంగుల పెట్టెలోకి ప్రవేశించే ఉంటుంది!

*

## న్యూయార్క్ ఒక రాత్రి

పాపినేని శివశంకర్

మన్‌హట్టన్ ఆశ్చర్య హర్మ్యాలు
బ్రూక్లిన్ బ్రిడ్జ్ దీప తోరణాలు
స్వేచ్ఛా విగ్రహ మకుట మణికాంతులు
వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఆరేసిన అంబరం
రాత్రి న్యూయార్క్
రెక్కల రేరాణి
స్టార్‌బక్స్‌లో కాఫీ
సర్కిల్ లైన్ క్రూజ్ జల విహారం
మాసీ మార్కెట్ వస్తు ప్రపంచంలో సోమర్ సాల్ట్
థాయ్-రోమా రెస్టరెంట్‌లో డిన్నర్
బ్రాడ్వేలో 'లేమిజరాల్స్'
రాత్రి న్యూయార్క్
డాలర్ నోటుపై అయస్కాంత నర్తకి
ఫుట్‌పాత్‌పై బొలీవియన్ బాండ్,
చైనీస్ పేవ్‌మెంట్ పెయింటింగ్స్
రాక్‌ఫెల్లర్ సెంటర్లో యూదు మత బోధలు
టైమ్స్ స్క్వేర్ రంగుల జనప్రవాహాలు
రాత్రి న్యూయార్క్
ఏడు ఖండాల ఇంద్రధనుస్సు
బహిరంగ చుంబనాలు
దిగంబర ప్రదర్శనాలు
కాసినోలు, డ్రగ్ ట్రాఫిక్‌లు
అంతుచిక్కని అధోలోకాలు
రాత్రి న్యూయార్క్
మోహజ్వాలా ద్వీప రహస్యం
అంటినా అంటని మానవస్పర్శలు
గీతలు దాటని చిరునవ్వు మర్యాదలు
థాంక్యూలు, సారీలు, ఓఖేలు
రాత్రి న్యూయార్క్
సమూహంలో సుడిదిరిగే ఏకాకి స్వగతం
హార్లెమ్‌లో నల్లజాతి ఆక్రోశం
మూడు దొంతర్ల సబ్‌వేల కింద
అణగారిన రెడ్ ఇండియన్ సమాధుల మూల్గులు
రాత్రి న్యూయార్క్
రహస్య వేదనాధుని
ఐశ్వర్య మహానగం
నిద్రపోని, నిద్రపోనివ్వని మహా నగరం
తియ్యని కాటేసే మహోరగం

*న్యూయార్క్ 22.07.01*